క్లుప్తంగా

వృత్తి విద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సులైన ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 30 రోజులపాటు అందించే శిక్షణకు 18–45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులైన వారు ఫోన్ నంబర్లు :94409 05478, 99856 06866, 94409 33028 లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేషన్ షాపుల ప్రారంభం



రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప రూరల్ : కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి సోమవావరం కడప నగరంలో పలు కార్యక్రమాల్లో బిజీగా గడిపారు. మేకలదొడ్డి, రామాంజనేయపురం, చలమారెడ్డిపల్లె, ఆర్కేనగర్‌లో రేషన్ షాపులను ప్రారంభించారు. మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కౌన్సిల్ ప్రతినిధులు

వైవీయూ : ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ వినియోగంపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని చెమ్ముమియాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) విద్యార్థులు జిల్లాస్థాయి యోగా పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజా, ఫిజికల్ డైరెక్టర్ ఎం. ప్రవీణ్‌కిరణ్ తెలిపారు. ఆదివారం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగ కాంపిటీషన్‌లో గురువిష్ణు స్వర్ణం, శివకేశవ రజతం, మల్లికార్జున, బన్నీలు కాంస్యపతకాలు సాధించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలి

వైవీయూ : 2020 సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య (ఆర్‌వీఎస్) రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ కోరారు. సోమవారం విశ్వవిద్యాలయంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో కోవిడ్ నేపథ్యంలో చాలా మంది విద్యార్థులు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు రాయలేకపోయారన్నారు. కావున త్వరలో వైవీయూలో పరిధిలో నిర్వహించే ఇన్‌స్టంట్ పరీక్షల్లో 2021, 2022 బ్యాచ్‌తో పాటు 2020 బ్యాచ్ విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరారు.

ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు, కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్. సుధాకర్, ఎస్ఐలు శ్రీనివాసుల రెడ్డి, ధనుంజయ, ఆర్.వి.కొండారెడ్డి, మహిళా ఎస్ఐ నస్రీన్, సిబ్బంది ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

సాగు.. అందాలు బాగు







రుతు పవనాలు రావడంతో రైతులు సాగుబడికి సన్నద్ధమవుతున్నారు. దుక్కి దున్నడం, నారు పోయడంలో తలమునకలై ఉన్నారు. మడి చేలలో ట్రాక్టర్లతో సేద్యం చేస్తుంటే కొంగలు తమ ఆహార వేటలో నిమగ్నమవుతున్న దృశ్యాలు చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ట్రాక్టర్లు అటు, ఇటు వెళ్లినప్పుడల్లా కొంగలు అక్కడ వాలి తమ ఆహారాన్వేషణ కొనసాగిస్తున్నాయి. సాధారణంగా అలికిడి అయితేనే ఎగిరిపోయే పక్షులు ట్రాక్టర్.. మీదికి వస్తున్నా లెక్క చేయకుండా వేటాడుతున్నాయి. మడులకు నీరు కట్టి, నారుపోసి, సేద్యం చేసే ప్రకృతి రమణీయ దృశ్యాలు నగర శివార్లలోని బైపాస్‌లో పాతకడప, పాలెంపల్లి, బుద్దాయపల్లె పరిసర ప్రాంతాల్లో కనువిందు చేస్తున్నాయి. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– కడప కార్పొరేషన్

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



కేవీకే కో ఆర్డినేటర్లతోపాటు శాస్త్రవేత్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న సుమతి

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి సూచించారు. సోమవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సాంకేతిక కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి పురోగతిపై చర్చించారు. కేవీకే ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు తోడ్పాటు అందించాలి



విద్యార్థినులకు పండ్లు, స్వీట్లు అందజేస్తున్న సమగ్ర శిక్ష మొబిలైజింగ్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : పేద విద్యార్థులకు దాతలు తోడ్పాటు అందించాలని సమగ్ర శిక్ష మొబిలైజింగ్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో కడప నగరంలోని చిన్నచౌక్‌లో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలో సోమవారం అతిథి భోజనం కార్యక్రమంలో భాగంగా సఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో అతిథి భోజనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, ఇతర శుభకార్యక్రమాల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు భోజనం అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ అధికారి విశ్వనాథరెడ్డి, ఏఎస్ఓ ఇలియాస్ ఖాన్, సఖి ఫౌండేషన్ అధ్యక్షురాలు రహమతున్నీసా, మీకోసం సేవా సంస్థ ప్రతినిధి విష్ణువర్ధన్, బాసట ఈశ్వరయ్య, మదర్ థెరీసా వృద్ధాశ్రమం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ ప్రాంతాల రక్షణకు చేయూతనివ్వండి



ఎస్పీతో మాట్లాడుతున్న ఇంటాక్ ప్రతినిధులు

కడప కల్చరల్ : జిల్లాలో అద్భుతమైన వారసత్వ సంపద ఉందని, ఆ ప్రాంతాల రక్షణకు చేయూతనివ్వాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఇంటాక్ సభ్యులు కోరారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ (ఇంటాక్) సభ్యులుగా 200 మంది.. జిల్లాలో మన పూర్వీకులు రక్షించి మనకు అందజేసిన వారసత్వ సంపదను రక్షించుకుని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అంతర్జాతీయ సంస్థ కోసం ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం ద్వారా తాము పని చేస్తూ జిల్లా ఉన్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా వారసత్వ, పర్యాటక ప్రదేశాల చిత్రాలతో ప్రచురించిన కడప హెరిటేజ్ పుస్తకాన్ని ఎస్పీకి అందజేశారు. దేశంలోనే తొలిసారిగా కేవలం జిల్లా వారసత్వ విశేషాలు, కథనాలతో జిల్లా గురించి విస్తృత ప్రచారం జరిగేలా నిర్వహిస్తున్న బులిటెన్‌ను కూడా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీకి శాలువా సమర్పించి సత్కరించారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు కొండూరు జనార్దన్‌రాజు, అనంతరంబొట్ల వెంకటసుబ్బయ్య, కోటేశ్వరరావు, వెల్లాల వెంకటేశ్వరాచారి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూకు 'రామజన్మభూమి' సావనీర్



సావనీర్‌ను వీసీకి అందజేస్తున్న పోస్టల్ అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డికి తపాలాశాఖ అధికారులు 'రామజన్మభూమి ఫిలాటెలి సావనీర్'ను అందజేశారు. తపాలా శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ జి.రాజేష్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, ఎస్.రెడ్డిబాషాలు సోమవారం విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌కు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా తపాలశాఖ అమలు చేస్తున్న పొదుపు పథకాలు, సేవలను గురించి వారు వివరించారు. గౌరవ సూచకంగా రామ జన్మభూమి ఫిలాటెలి సావనీర్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తపాలా శాఖ మార్గదర్శకం మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రామ జన్మభూమి అలయ విశిష్టతను, ప్రారంభ కార్యక్రమాల దృశ్యాలతో ఆధ్యాత్మిక చింతనను కలిగించేలా సావనీరు ఉందని వైస్ చాన్సలర్ అన్నారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్ బాబు, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ ఎస్.వి.సుబ్బారెడ్డి, తపాలా శాఖ పీఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం.వీరశేఖర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ, ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కడప ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్ తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప మండలం వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో అతిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ–2 ఇర్షాల్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు సక్రమంగా పంపాలన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా పేరెంట్ కమిటీలు ప్రతి నెల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలపై సమీక్షించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి ఇలియాష్‌బాషా, ఎస్టీయూ నగరశాఖ అధ్యక్షులు సాధిక్‌అలీ, హెడ్ టీచర్ షేక్ నజీబుల్లా, పేరెంట్ కమిటీ చైర్మన్ సాల్మ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న వైద్య విద్యార్థులు

కడప అర్బన్ : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల(రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ తెలిపారు. కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) ఆవరణలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వైద్య విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ చెట్ల ప్రాముఖ్యతను తెలియజేసి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శారద, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు దాసరి, వైద్య విద్యార్థులు, వైద్య అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడీపీ సర్వే పేరుతో ఇళ్ల పన్ను పెంపు సరికాదు

- ఇలా పెంచవద్దని సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశాం
- అయినా అధికారులు నోటీసులు ఇస్తూనే ఉన్నారు
- ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు నిలుపుదల చేయాలి
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ పరిధిలో ఏడీపీ సర్వే పేరుతో ఇంటి పన్నులు పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, ఎం.సుబ్బారెడ్డి, ఆర్.బాలస్వామిరెడ్డి, చెన్నయ్య, షంషీర్, కె. సూర్యనారాయణరావు, అజ్మతుల్లా అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీవో నంబర్ 198ని అడ్డం పెట్టుకొని ఇష్టానుసారంగా పన్నులు పెంచుతున్నారన్నారు. గతంలో రూ.2 వేలు పన్ను వస్తున్న వారికి రూ.10 వేలు వస్తోందన్నారు. పది, ఇరవై శాతం డీవియేషన్ ఉన్నా 100 శాతం పెనాల్టీ విధిస్తున్నారని, 2011 మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్లాన్ తీసుకొని ఇల్లు కట్టుకున్న వారికి 2021 మాస్టర్ ప్లాన్ ప్రకారం లేదని వంద శాతం పెనాల్టీ వేస్తున్నారన్నారు. మొత్తం మీద నగర ప్రజలపై రూ.20 కోట్ల పన్నుల భారం వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రంలో ఏ నగరపాలక సంస్థలో గానీ, మున్సిపాలిటీలో గానీ ఈ తరహా పన్నులు వేయడం, పెనాల్టీలు విధించే విధానం లేదన్నారు. దీన్ని వెంటనే నిలుపుదల చేయాలని, ప్రభుత్వ నిర్ణయం వచ్చేవరకూ ఆగాలని ఈనెల 4వ తేదీన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లమంతా తీర్మానించామన్నారు. అయినా అధికారులు వినకుండా పన్నులు పెంచేందుకు ప్రజలకు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఇంప్రూవ్‌మెంట్ చేసిన కమర్షియల్ అసెస్‌మెంట్స్‌కే పన్నులు పెంచుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అన్ని అసెస్‌మెంట్స్‌కు పెంచుతున్నారని తెలిపారు. ఈ చర్యలకు పాల్పడిన అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. అనంతరం వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రంకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ఎం.సుబ్బరాయుడు, బసవరాజు పాల్గొన్నారు.

ఘనంగా సమితి వార్షికోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని బాసట చిల్డ్రన్ హోమ్‌లో వరద ఆది సేవా సమితి మొదటి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ కేశవరెడ్డి మాట్లాడుతూ సంస్థ నిర్వాహకులు బ్రహ్మయ్య యాదవ్ తన సోదరుడు ఈ లోకాన్ని విడిచి వెళ్లడంతో.. అన్న పేరు చిరస్థాయిగా నిలవాలనే ఉద్దేశంతో తన అన్న వరద ఆది నారాయణ యాదవ్ పేరు మీద వరద ఆది సేవా సమితి ఏర్పాటు చేశారన్నారు. బాసట చిల్డ్రన్ హోమ్ వ్యవస్థాపకులు కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ వరద ఆది సేవా సమితి భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా సేవలు చేస్తున్న ఎన్జీఓలు, దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాల అధికారి విశ్వనాథరెడ్డి, కిరణ్ యాదవ్, కిషోర్ యాదవ్, పొలతల రామచంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని కడప నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీటిపై వస్తున్న సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాలరాజు, డీసీపీ, ఏసీపీలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట బొగ్గులేటిపల్లి సరిహద్దులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు.

బస్టాండ్‌లో మురుగునీటి నిల్వతో ఇక్కట్లు



డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోజూ వివిధ ప్రాంతాలకు వెళుతూ, వచ్చేందుకు ఆర్టీసీ బస్టాండుకు వస్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఐ నాయకులు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావును కోరారు. వారు సోమవారం ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నెలల తరబడి మురుగునీటి నిల్వతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలోకి వెళ్లే ప్రధాన గేటు వద్దనే మురుగు నీటి నిలువతో రాళ్లు వేసుకుని రాకపోకలు సాగించే దుస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. కడప ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతమంతా అధ్వానంగా తయారైందని, చిన్నపాటి వర్షానికే అవుట్ గేట్ సమీపమంతా రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉండి మురుగు కుంటలా తయారైందన్నారు. ఆర్టీసీ గ్యారేజీలో కార్మికులు సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురికినీరు, వర్షపు నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య మెరుగుకు తగిన చర్యలు చేపట్టకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, శంకర్ నాయక్, సుబ్బరాయుడు, భాగ్యలక్ష్మి, యేసు రత్నం, అంకుశం పాల్గొన్నారు.

సాహితీ జగత్తులో 'సినారే'కు ప్రత్యేక పీఠం



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : తెలుగు సాహిత్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి విలక్షణమైన రచనలు చేసి తనకంటూ ప్రత్యేక పీఠాన్ని ఏర్పాటు చేసుకున్న కవి అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ కవి నారాయణరెడ్డి పరిశోధన గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వ సంప్రదాయాలు, ప్రయోగాలు' గొప్ప ప్రామాణికంగా నిలిచిందని కొనియాడారు. బ్రౌన్ కేంద్రంతో ఆయనకు చాలా అనుబంధం ఉందని, బ్రౌన్ పరిశోధన కేంద్రానికి 1998లో ఒకసారి, 2003లో మరోసారి రావడమే కాక ఎంపీ నిధుల నుంచి రెండవ అంతస్తుకు రూ.10 లక్షల నిధులు ఇచ్చారని గుర్తు చేశారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ సినారె ప్రాంతీయ భేదం లేని కవి అని తన పాటల ద్వారా పలుమార్లు ఈ విషయాన్ని స్పష్టం చేశారన్నారు. ఆయన తొలి చలనచిత్ర గీతం 1961లో గులేబకావళి కథ కోసం రాశారని, మూడువేలకు పైగా సినీ గీతాలు రాశారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు వెంటనే పంపిణీ చేయాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ కార్యాలయ స్పందన హాలులో జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇంకా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. అన్ని పుస్తకాలను తెప్పించి వెంటనే పంపిణీ చేయాలన్నారు. విద్యా హక్కు, ఫీజు నియంత్రణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, నాయక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

కమలాపురం : రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలను కాపాడు కోవడానికి సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని సంబటూరు, కోగటం గ్రామాల్లో సాగు చేసిన మినుము, పత్తి తదితర పలు రకాల పంటలను ఆమె పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు బెట్టకు గురికావడం జరిగిందన్నారు. బెట్ట పరిస్థితిని తట్టుకునేందుకు లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా లేదా 5 గ్రాములు 19–19–19 లేదా పంట పూత దశలో ఉన్నట్లయితే 10 గ్రాముల చొప్పున 13–0–45ను కలిపి పిచికారీ చేసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. మినుము పంటకు రసం పీల్చే పురుగులు ఆశించాయని, వాటి నివారణకు ఇమిడక్లోప్రిడ్ 0.4 మి.లీ. మరియు పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు ప్రొఫినోపాస్ 2 మి.లీ. లేదా అసిఫెట్ 1.5 గ్రాములు పిచికారీ చేసి 15 రోజుల తర్వాత 2 మీ.లీ. లేదా డైఫన్ దియురాన్ 1.25 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె రైతులకు వివరించారు.